నగరంలోనే ప్రసిద్ధి గాంచిన కల్వరీ టెంపుల్ క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. మిరుమిట్లు గొలిపే విద్యుత్ వెలుగులలో మిలమిలా మెరిసిపోతున్నది. భక్తులకు కను విందు చేయనున్నది. కల్వరీ టెంపుల్‌లో భక్తులకు అన్ని విధాల సేవలను అందించేందుకు నిర్వాహకులు ప్రత్యేక వసతులు, స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సుదూర ప్రాంతాల నుంచి నాలుగు సర్వీసుల్లో కలిపి మూడు లక్షలకు పైగా భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఆరాధన మహోత్సవాల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. – మాదాపూర్, డిసెంబర్ 24;

నిమిషానికి.. 21 చికెన్ బిర్యానీలు

స్విగ్గీలో.. చికెన్ బిర్యానీ ఆర్డరే టాప్... నివేదిక విడుదల చేసిన స్విగ్గీ

సిటీబ్యూరో, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ): ఎప్పటిలాగానే చికెన్ బిర్యానీ సత్తా చాటుకుంది. అత్యంత ఇష్టమైన ఫుడ్‌గా బిర్యానీ నిలిచింది. ఆన్‌లైన్ ఫుడ్ ఆధారిత సంస్థ స్విగ్గీ 'హౌ ఇండియా స్విగ్గుడ్' అనే శీర్షికన రిపోర్టు విడుదల చేసింది. ఈ ఏడాది 8.3 కోట్ల ఆర్డర్లతో వరుసగా తొమ్మిదోసారి దేశంలో అత్యంత ఆదరణ పొందిన వంటకంగా బిర్యానీ నిలిచింది. ప్రధానంగా చికెన్ బిర్యానీకి 4.9 కోట్ల ఆర్డర్లు రావడం విశేషం. స్విగ్గీ రిపోర్ట్ ప్రకారం, బిర్యానీ ఆర్డర్లలో హైదరాబాద్ టాప్‌లో నిలిచింది. 2024లో 9.7 మిలియన్ల బిర్యానీ ఆర్డర్‌లతో బిర్యానీ లీడర్ బోర్డులో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. అనంతరం, బెంగళూరు 7.7 మిలియన్ల ఆర్డర్లు, చెన్నై 4.6 మిలియన్ల ఆర్డర్లతో ఉన్నాయి. రంజాన్ సందర్భంగా స్విగ్గీలో 6 మిలియన్ ప్లేట్ల బిర్యానీలు ఆర్డర్ చేసినట్టు పేర్కొంది. ఇందులో కూడా హైదరాబాద్ టాప్‌లో ఉందని వివరించింది. ఒక్క నగరం నుంచే 10 లక్షల కంటే అధికంగా బిర్యానీ ఆర్డర్లు చేసినట్టు పేర్కొంది. చికెన్, మటన్, పన్నీరు, ఎగ్ తదితర విభిన్న రకాల 15.7 మిలియన్ల బిర్యానీలు హైదరాబాద్ నుంచి ఆర్డర్ ఉన్నట్టు పేర్కొంది. ప్రతి నిమిషానికి 34 బిర్యానీలు ఆర్డర్ వచ్చినట్టు వివరించారు. ఏడాది పొడవునా ప్రతి నిమిషానికి 21 చికెన్ బిర్యానీలు ఆర్డర్ వచ్చాయని పేర్కొంది. ఒక వినియోగదారుడు 60 బిర్యానీలను ఆర్డర్ చేయడానికి ఏకంగా రూ.18,840 రూపాయలు వెచ్చించినట్టు పేర్కొన్నారు. అంతే కాదు టీ20 ప్రపంచ కప్ సందర్భంగా 869 వేల చికెన్ బిర్యానీలు ఆర్డర్ వచ్చినట్టు తెలిపింది. అత్యధికంగా చికెన్ షావర్మాలను ఆర్డర్ చేసినట్టు పేర్కొంది. రాత్రిపూట భోజనం చేయడానికి ఒక వినియోగదారుడు ఒకే ఆర్డర్‌లో 30 బిర్యానీలు ఆర్డర్ చేశాడని వివరించింది. హైదరాబాద్‌లో అల్పాహారం దోసె, బ్రేక్‌ఫాస్ట్‌గా ఉల్లిపాయ దోస అత్యధికంగా ఆర్డర్ వచ్చిందని, ఇది దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొంది. 17.54 లక్షల దోసెలు నగరవాసులు స్విగ్గీ నుంచి ఆరగించినట్టు తెలిపింది.

యాదవులను మోసం చేసిన రేవంత్

- మంత్రి పదవీ లేదు.. కార్పొరేషన్ అవకాశమివ్వరు
- ప్రభుత్వ వైఖరికి నిరసనగా 28న మహాధర్నా, నిరాహార దీక్షలు
- యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు రాములు యాదవ్

సమావేశంలో నినాదాలు చేస్తున్న రాములు యాదవ్, చక్రధర్ యాదవ్, రవి యాదవ్

ఖైరతాబాద్, డిసెంబర్ 24: ఎన్నికల ముందు యాదవులకు మంత్రి పదవులు ఇస్తాం, కార్పొరేషన్ల చైర్మన్ గిరీలు కేటాయిస్తాం.. అది చేస్తాం... ఇది చేస్తామని హామీ ఇచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేసిండని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చక్రధర్ యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వం యాదవులకు సముచిత స్థానం కల్పించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ యాదవులకు ఒక మంత్రి పదవీ, ఐదు ఎమ్మెల్యేలు, మూడు కార్పొరేషన్లు, రాజ్యసభ, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ, ఎమ్మెల్సీ తదితర పదవులు ఇచ్చి గౌరవించారని గుర్తు చేశారు. రాష్ట్ర జనాభాలో 15 శాతం ఉన్న యాదవులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కేవలం రెండు సీట్లు మాత్రమే కేటాయించారని, అది కూడా నగరంలో కేటాయించారని, కానీ, కాంగ్రెస్ పై ఉన్న అయిష్టతతో ప్రజలు ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించలేదన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత అంజన్ కుమార్ యాదవ్‌కు మంత్రి పదవీ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఐదు కార్పొరేషన్ చైర్మన్, మూడు ఎమ్మెల్సీ స్థానాలు ఇవ్వాలన్నారు. ఏడాది కావొస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదన్నారు. రాష్ట్ర చరిత్రలో యాదవులకు ఒక్క స్థానం కూడా కల్పించని ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 28న ఇందిరా పార్కు వద్ద ధర్నా, నిరాహార దీక్షలు చేపడుతామన్నారు. అప్పటికీ, ప్రభుత్వం దిగి రాకపోతే రాష్ట్ర అగ్ని గుండంగా మారుతుందని, లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, జీహెచ్ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ ఒక్క యాదవుడు కాంగ్రెస్‌కు ఓటు వేయరని, ఆయా ఎన్నికల్లో ఎలా గెలుస్తారో చూస్తామన్నారు. ఈ సమావేశంలో యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి గుడెగె శ్రీనివాస్ యాదవ్, జీహెచ్ఎంసీ అధ్యక్షులు జి రవి యాదవ్, శ్రీశైలం యాదవ్, కేశబోయిన వీరేందర్ యాదవ్, రాచంద్రం యాదవ్, శివ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, కార్తీక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి ఒలంపియాడ్స్‌లో మెరిసిన నారాయణ విద్యార్థులు

జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఒలంపియాడ్స్‌లో ప్రతిభను కనబర్చిన విద్యార్థులతో నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు, తదితరులు

కొండాపూర్, డిసెంబర్ 24: అంతర్జాతీయ ఒలంపియాడ్స్‌లో నారాయణ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చి గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ని సాధించారు. మాదాపూర్‌లోని నారాయణ విద్యా సంస్థల కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ డైరెక్టర్లు పి.సింధూర, పి.శరణిలు వివరాలను వెల్లడించారు. 2024లో నారాయణ స్కూల్స్ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ ఒలింపియాడ్స్‌లో అత్యుత్తమ ప్రదర్శనను కనబర్చి, విద్యా సంస్థల పేరు, ప్రఖ్యాతలను ఖండంతరాలు దాటించారన్నారు. ఆస్ట్రానమీ, సైన్స్, మ్యాథమెటిక్స్ విభాగాల్లో అంతర్జాతీయ పోటీ పరీక్షల్లో నారాయణ స్కూల్ విద్యార్థులు తిరుగులేని ప్రతిభను కనబర్చారన్నారు. డిసెంబర్‌లో రొమేనియాలోని బుకారెస్టోలో జరిగిన ఇంటర్నేషనల్ జూనియర్ సైన్స్ ఒలంపియాడ్స్‌లో శ్వేతాంక్ అగర్వాల్, భవ్య గున్నాల్‌లు గోల్డ్ మెడల్స్ సాధించగా, అక్టోబర్‌లో నేపాల్‌లోని ఖాట్మాండ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ ఆన్ ఆస్ట్రోఫిజిక్స్‌లో ప్రాంజల్ దీక్షిత్ బంగారు పతకాన్ని, ఆగస్టులో బ్రెజిల్‌లో రియో డీ జెనీరోలో జరిగిన ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ ఆన్ ఆస్ట్రానమీ, ఆస్ట్రోఫిజిక్స్ సీనియర్ విభాగంలో బనిబ్రత మజీ, సానిధ సరాఫ్‌లు రజత పతకాలతో మెరిసారన్నారు. వీటితో పాటుగా ఇండియన్ నేషనల్ మ్యాథమెటికల్ ఒలంపియాడ్‌లో దేశ వ్యాప్తంగా 1,101 మంది ఎంపికవ్వగా, ఇందులో నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు అధికంగా 144 మంది ఎంపికయ్యారన్నారు. అనంతరం, ఒలంపియాడ్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఘనంగా సన్మానించి, సర్టిఫికెట్లను అందజేశారు.

నట్స్ బోల్ట్స్ ఆఫ్ వార్ అండ్ పీస్ పుస్తకావిష్కరణ

'నట్స్ బోల్ట్స్ ఆఫ్ వార్ అండ్ పీస్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్, రచయిత యాదవరెడ్డి

రవీంద్రభారతి, డిసెంబర్ 24: చాలా మంది సిద్ధాంతాలు చెబుతారు. కానీ, పాటించే వారు మాత్రం కొద్ది మందే ఉంటారని, అలాంటి వారిలో మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి ఒకరని, నమ్మిన సిద్ధాంతం కోసం పాటుపడే వ్యక్తి అని రాష్ట్ర సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. రవీంద్రభారతిలోని మెయిన్ హాల్‌లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి రచించిన 'నట్స్ బోల్ట్స్ ఆఫ్ వార్ అండ్ పీస్' పుస్తకావిష్కరణ సభ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సురవరం లాంటి వారు హార్డ్ కోర్ కమ్యూనిస్టు అయితే, జైపాల్ రెడ్డి, యాదవరెడ్డి లాంటి వారు సాఫ్ట్‌కోర్ కమ్యూనిస్టులు అని కొనియాడారు. పదవుల కోసం కాకుండా నమ్మిన సిద్ధాంతం కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేశారన్నారు. ఉద్యమం సమయంలో క్రియాశీల ప్రాత పోషించిన వారి గురించి కూడా ఈ పుస్తకంలో వివరించాల్సిన అవసరం ఉందన్నారు. చైనా దురాక్రమణ, మణిపూర్ అంతర్యుద్ధంపై చర్చ జరగాలని, వాటిని నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్ మాట్లాడుతూ, యాదవరెడ్డి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక ప్రాత పోషించారని, నమ్మిన సిద్ధాంతం కోసం పదవుల కోసం పాటుపడకుండా తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పనిచేశారని కొనియాడారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంపీ మల్లు రవి, మాజీ ఎంపీ హనుమంతరావు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరం

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్

సిటీబ్యూరో, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ): వినియోగదారుల రక్షణ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చౌహాన్ హాజరయ్యారు. ఆయన మాట్లాడు తూ.., వినియోగదారుల రక్షణ చట్టం 1986 డిసెంబర్ 24న అమలులోకి వచ్చిందని తెలిపారు. వినియగదారుల ఫోరమ్స్ పనితీరు బాగుందని కొనియాడారు. డిజిటల్ విధా నం, వర్చువల్ విచారణల ద్వారా వినియోగదారులకు సత్వర న్యాయం అందేలా సంఘా లు మరింత సమర్థవంతంగా పనిచేయాలన్నారు. వినియోగదారులు ఆహారపు పదార్థాలు, నగలు, ఇతర ఏ వస్తువునైనా కొనుగో లు చేసేటప్పుడు ధర, నాణ్యతా ప్రమాణాలు తెలుసుకొని కొనుగోలు చేయాలని చెప్పారు. ఎక్కడైనా అన్యాయం జరిగితే సత్వరమే వినియోగదారుల ఫోరమ్‌లో అర్జీ దాఖలు చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత ఫోరమ్స్ తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో కూడా విద్యార్థులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ఆహార తనిఖీల్లో సంబంధిత అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వినియోగదారులు ఎక్కడా నష్టపోకుండా నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేయాలని తెలిపారు. అనంతరం, వినియోగదారుల చట్టాలపై ఉపన్యాసం ఇచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. తూనికల కొలతల శాఖ ఏర్పాటు చేసిన వివిధ రకాల వస్తువుల స్టాల్స్‌ను సందర్శించారు.

లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలి

కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్, డిసెంబర్ 24: ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో ఉప్పల్ మండలానికి చెందిన 160 మందికి గాను కోటీ 60 లక్షల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, చెక్కుల పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా లక్షా నూట పదహారుతో పాటు తులం బంగారం ఇవ్వాలన్నారు. సేవలలో తాను నిబద్ధతతో తన వంతు పాత్రను పోషిస్తూ నిరంతరం ప్రజల్లో ఉంటున్నానన్నారు. నియోజక వర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వాణిరెడ్డి, కార్పొరేటర్లు బన్నాల గీతాప్రవీణ్, పన్నాల దేవేందర్ రెడ్డి, శాంతి సాయిజెన్ శేఖర్, ప్రభుదాసు, రజితారెడ్డి పాల్గొన్నారు.

మౌలాలి గుట్టపై ఉర్స్ ఉత్సవాలకు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, డిసెంబర్ 24: ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మౌలాలి గుట్టపై జరిగే ఉర్సు ఉత్సవాలకు ముందస్తు ఏర్పాటు చేయాలని బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్థానిక నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతిష్టాత్మకమైన మౌలాలి గుట్టపై జరిగే ఉర్సు ఉత్సవాలకు ముందస్తుగా 1000 తాత్కాలిక లైటింగ్, ఎమర్జెన్సీ ట్రాన్స్ ఫార్మర్, మొబైల్ టాయిలెట్స్, తాగు నీటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గుట్టపైకి వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేస్తామని, ఎమర్జెన్సీ మెడికల్ టీంను ఏర్పాటు చేస్తామన్నారు. నగరం నలుమూల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు జాగ్రతలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్, అంజయ్య, రాము యాదవ్, జీకే హన్మంతరావు, మధుసూదన్ రెడ్డి, జనార్దన్, సతీశ్, అనిల్ కిశోర్, కోటేశ్వర్, రాజు, సూరి, బాలకృష్ణ గుప్త, ఫరీద్, గుత్తి రాంచందర్, సుజాత, ఉర్సు నిర్వాహక కమిటీ ఇన్‌చార్జి సయీద్, రజా అలీ, భాగ్యనందరావు, ఉస్మాన్, సంతోష్ నాయుడు, నవాబ్, మారుతీ ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధికి స్టాండింగ్ కమిటీ దూరం!

చిన్నపాటి పనులను వెంటాడుతున్న నిధుల సమస్య

ప్రతి వారం జరగాల్సిన స్టాండింగ్ కమిటీ సమావేశాలు వాయిదా

సిటీబ్యూరో, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో వారానికొకసారి జరగాల్సిన స్థాయి సంఘం లక్ష్యం నీరుగారుతోంది. అభివృద్ధి పనులకు ప్రధానంగా నిధుల లేమితో ఎజెండా అంశాల జోలికి కమిషనర్ వెళ్లడం లేదు. ఫలితంగా పురోగతిలో ఉన్న పనులు నత్తనడకన జరుగుతుండగా, కొత్త ప్రాజెక్టులు పట్టాలెక్కడం లేదు. కాలనీలలో రోడ్ల నిర్మాణం, వరద నీటి కాలువలు, శ్మశాన వాటికల అభివృద్ధి, పార్కుల నిర్మాణం, కమ్యూనిటీ హాల్ మరమ్మతులు, మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్స్, మోడల్ మార్కెట్, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, ఫిష్ మార్కెట్లు, నాలాల అభివృద్ధి పనులు ఇలా ఇతరత్రా పనులు కొన్నేండ్లుగా ముందడుగు పడకపోవడం ఇందుకు నిదర్శనం.

జీహెచ్ఎంసీ స్థాయి సంఘం సభ్యులు 15 మంది కార్పొరేటర్లతో ఏర్పాటయ్యింది. ఏడాది కాల పరిమితితో 15 మంది సభ్యుల పదవీ కాలం ఉంటుంది. ప్రతి వారంలో గురువారం మేయర్ అధ్యక్షతన సభ్యులు, అధికారులు కలిసి దాదాపు రూ.3 కోట్లకు పైగా పలు అభివృద్ధి నిర్వహణ పనులను ఆమోదిస్తుంది. వాటిని మూడు నెలలకోసారి జరిగే కౌన్సిల్ సమావేశంలో పెట్టి ఆమోద ముద్ర వేస్తారు. ఆ తర్వాత పనులను పట్టాలెక్కించి ప్రజలకు మౌలిక వసతులను కల్పించనున్నారు. ఐతే, ఈ చిన్నపాటి పనులను కూడా చేపట్టేందుకు నిధుల సమస్య ఉందంటూ దాటవేత ధోరణిని ప్రదర్శిస్తున్నారు. ఈ క్రమంలోనే కొత్త ప్రతిపాదనలు రాకపోవడంతో ఏం చర్చించాలంటూ ప్రతి వారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశాలను సైతం వాయిదా వేస్తుండటం గమనార్హం.

గుండె చికిత్సలో ఏఐ పాత్ర అమోఘం!

ఆర్టిఫిషీయల్ ఇంటెల్లీజెన్స్‌తో ఐవీయూఎస్ ట్రీట్‌మెంట్

సాంకేతికత సాయంతో కార్డియాలజిస్టులకు మరింత అనుకూలం

సిటీబ్యూరో, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ): గుండె సంబంధిత చికిత్సలో ఆర్టిఫిషీయల్ ఇంటెల్లీజెన్స్ ముఖ్య భూమికను పోషిస్తుందని పలువురు కార్డియాలజిస్టులు పేర్కొన్నారు. మంగళవారం కొండాపూర్‌లోని శ్రీశ్రీ హోలిస్టిక్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటి ఏంజియోగ్రఫీ స్టెంటింగ్ చికిత్సలో ఏఐ ఐవీయూఎస్ విధానాన్ని ప్రారంభించారు. యాంజియోప్లాస్టి సర్జరీలను మరింత కచ్చితంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ఏఐ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా నెట్ వర్కింగ్‌ను ఆవిష్కరించారు. ఏఐ సాయంతో వైద్యులు చికిత్స సమయంలో మరింత సమర్థవంతంగా నిర్ణయాలు తీసుకునేందుకు సహకరిస్తుందన్నారు. కచ్చితమైన వాస్కులర్ కొలతలతో చికిత్స స్ట్రాటజీలను రూపుదిద్దుకునే వీలుంటుందన్నారు. అదే విధంగా హై క్వాలిటీ ఇమేజ్‌లను ఎప్పటికప్పుడు పొందే వీలుండగా, దీంతో చికిత్సా విధానం మరింత మెరుగుపడుతుందన్నారు. ఈ సందర్భంగా హోలిస్టిక్ కార్డియో బృందం డా.శ్రవణ్, డా. వికాస్ రెడ్డి మాట్లాడుతూ, ఏఐ సాయంతో చికిత్సా విధానం అందుబాటులోకి రావడం తెలుగు రాష్ట్ర ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజీలో ఇదొక గేమ్ ఛేంజర్ అవుతుందన్నారు. హృదయ సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి, చికిత్స చేయడం ద్వారా ప్రమాదకరమైన పరిస్థితులు తప్పుతాయన్నారు. 15 మంది సీనియర్ వైద్య నిపుణులతో హోలిస్టిక్ హాస్పిటల్‌లో ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని డా. వీఎస్ రామచంద్ర అన్నారు.

సెంటర్ ఫర్ సైన్స్, ఎన్విరాన్‌మెంట్‌లో శంషాబాద్ మున్సిపాలిటీకి ఉత్తమ అవార్డు

ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందుకుంటున్న ఎన్విరాన్‌మెంట్ అధికారి అనిల్, తదితరులు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 24: సెంటర్ ఫర్ సైన్స్, ఎన్విరాన్‌మెంట్‌లో శంషాబాద్ మున్సిపాలిటీకి ఉత్తమ అవార్డు లభించినట్లు శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి తెలిపారు. ఈ నెల 19న ఢిల్లీలో చేంజ్ మేకర్స్ కాన్క్లేవ్ 2024లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపాలిటీకి ఘన వ్యర్థాల నిర్వహణలో ఎన్విరాన్‌మెంట్ అధికారి అనిల్‌కు ఉత్తమ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. అవార్డును నిర్వాహకులు సెంటర్ ఫర్ సైన్స్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ సునీతా నారాయణ చేతుల మీదగా అవార్డును అందుకున్నట్లు వివరించారు. ఢిల్లీలో స్వీకరించిన అవార్డును మంగళవారం ఎన్విరాన్‌మెంట్ అధికారి, మున్సిపల్ ఏఈ నరేశ్ సమక్షంలో చైర్‌పర్సన్ సుష్మారెడ్డికి అందజేశారు. ఇలాంటి అవార్డులు రావడంతో మరింత బాధ్యతగా పని చేస్తామని అనిల్ తెలిపారు.

ఘనంగా స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎక్సలెన్స్ 17వ కాన్వొకేషన్

సిటీబ్యూరో, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ): నగరంలోని పీజీడీఎం కళాశాల ఐసీబీఎం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎక్సలెన్స్ 2022-24 బ్యాచ్ యొక్క 17వ కాన్వొకేషన్ వేడుకలు మంళవారం జరిగాయి. కార్యక్రమంలో ఐసీబీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ షంషుద్దీన్ జరార్, ప్రొఫెసర్ పి.నారాయణ్ రెడ్డి, టీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మంగళవారం సాయంత్రం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని అన్వయ కన్వెన్షన్‌లో జరిగిన స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పూసర్ల వెంకట సింధు వివాహ రిసెప్షన్‌కు పలువురు రాజకీయ ప్రముఖులు, సినీ నటులు, క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

రియల్ ఎస్టేట్ కుప్ప కూలింది..

మా పరిస్థితి ఏమిటి?

సీఎంను ప్రశ్నించిన రియల్టర్స్

అబిడ్స్, డిసెంబర్ 24: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని కుప్ప కూల్చిందని, తమ పరిస్థితి ఏమిటి? అని రియల్ ఎస్టేట్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. మోజంజాహి మార్కెట్‌లోని తెలంగాణ జన సమితి కార్యాలయంలో తెలంగాణ రియల్టర్స్ అసోసియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధులు ప్రస్తుత రియల్ ఎస్టేట్ వ్యాపారంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలతో పోటీ పడలేక కనీసం కార్యాలయ ఖర్చులు కూడా వెళ్లక తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నిస్తున్నామన్నారు. 20 శాతం యువత రియల్ ఎస్టేట్‌పై ఆధారపడి ఉపాధి పొందుతోందని, రాష్ట్రంలోని జిల్లాల వారీగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి రియల్ వ్యాపార అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించాలని కోరారు. ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రంగారావు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ క్యాలండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం